ప్రజాశక్తి

గురువారం 21 మార్చి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వారిపై వీరు.. వీరిపై వారు...

కూటమి పార్టీల నాయకుల తీరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందన్న' సామెత మాదిరిగా టిడిపి, జనసేన సీట్ల సర్దుబాటు వ్యవహారంలో బిజెపి ఆధిపత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అభ్యర్థుల ఖరారులో తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ నగరంలోని దక్షిణం, భీమిలి సెగ్మెంట్లలో తగాదాల దాకా వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. దక్షిణంలో బుధవారం జనసేన పార్టీలో గ్రూపుల మధ్య కొట్లాట జరిగింది. పెందుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ కోసం టిడిపి నేతల మధ్య సిగపట్లు కొనసాగుతున్నాయి. ప్రధానమైన టిడిపి నేతలు బండారు, గండి, మరో నాయకుడు పీలా గోవింద సత్యనారాయణ వంటి వారికి జనసేన వల్ల టికెట్లు దక్కలేదన్న ఆవేదన ఉంది. వీరిలో గండి బాబ్జీ వైసిపి తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం కాగా, బండారు కూడా ఇదే దారిలో ఉన్నట్లు భోగట్టా. పెందుర్తిని జనసేనకు కేటాయించారు.

తొలుత సునాయసమే అనుకున్నా...

పంచకర్ల రమేష్ బాబు అభ్యర్థిత్వానికి తొలుత పెందుర్తిలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అయితే సీనియర్లంతా ఇరు పార్టీల నుంచీ దూరం కావడంతో ఈయనకు సహకరించే వారు కరువయ్యారు. పంచకర్లకు 2024 కష్టం కానుందన్నది టిడిపి నేతలు బాహాటంగా చెబుతున్నారు. తొలి నుంచీ కలసి వెళ్దామనుకున్న ఈ రెండు పార్టీలు బిజెపితో పొత్తు తర్వాత చెరోదారిలో పయనించడం విశేషం. ఉత్తరం సీటును కూడా బిజెపికి తేల్చాయని చెప్పుకున్న టిడిపి, జనసేన మధ్య ఇక్కడ కూడా సఖ్యత కానరావడం లేదు.



జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ఈ సీటును ఆశించారు. గత 2019 ఎన్నికల్లో గణనీయమైన ఓటింగ్ ఈమెకు ఇక్కడ లభించింది. టిడిపి వార్డు నేతలు సైతం బిజెపి అభ్యర్థి విష్ణుకుమార్ రాజుపై గుర్రుగా ఉన్నారు. గతంలో గెలిచినప్పుడే ఎవ్వరినీ పట్టించుకోలేదని 2014 నాటి బిజెపి, టిడిపి పొత్తును గుర్తుచేసుకుని బిజెపికి ఓటు చేయమంటూ వాపోతున్నారు.

దక్షిణం కూటమిలో వైరం...

దక్షిణంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌పై సొంత పార్టీలో అసంతృప్తి పెద్ద ఎత్తున ఉండగా, జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణకు జనసేన నుంచి సీటు దక్కింది. ఈయన అభ్యర్థిత్వంపై తొలినుంచీ నియోజకవర్గ ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు. వైసిపికి సీతంరాజు సుధాకర్ రాజీనామా చేశారు. తొలి నుంచీ ఈ సెగ్మెంట్‌ను అంటిపెట్టుకుని సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. ముఖ్యంగా మత్స్యకారులు, యాదవులు, ఇతర సామాజిక తరగతులతో మమేకమై పర్యటనలు చేశారు. 2024లో టిడిపి-జనసేన తరపున పోటీలో ఉండే అవకాశం దక్కుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు సైతం ఈయనకు భరోసా ఇవ్వడంతో తాను అభ్యర్థి అనుకున్నా మేథమేటిక్స్ పనిచేయలేదు. టిడిపి జనసేన మధ్య కెమిస్ట్రీ వర్క్‌అవుట్ అయి ఈయనకు టికెట్ దక్కకుండా పోయింది. భీమిలిలో ఇంకా అభ్యర్థులెవరిని పెట్టినా పెద్ద కుంపట్లే అంటుకుంటాయన్న ఆందోళనతో కూటమి పార్టీలు ఈ సెగ్మెంట్‌ను ఇంతవరకూ ముట్టుకోవడం లేదు. మొత్తానికి బిజెపితో వెళ్లడం వల్ల ఎంత నష్టమో ఎన్నికలకు ముందే ప్రధాన రెండు పార్టీలకూ ముఖ్యంగా టిడిపికి స్పష్టమైందనే చెప్పొచ్చు.



విశాఖలో కురుస్తున్న వర్షం

మబ్బుల్లో విశాఖ...

పలుచోట్ల మోస్తరు వర్షం
అల్పపీడన ద్రోణి ప్రభావం
మరో రెండు రోజులు అడపా దడపా వర్షాలకు అవకాశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎండలు మండే మార్చి నెలలో కరి మబ్బులు, చిరు జల్లులు, అక్కడక్కడ మోస్తరు వర్షాలతో విశాఖ వాసులకు ఊరట కలిగింది. ఒక్కసారిగా విశాఖలో బుధవారం 30.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సుమారు 16 మి.మీ వర్షపాతం విశాఖలో నమోదైంది. తునిలో 18, రాష్ట్రంలో అత్యధికంగా కాకినాడలో 36 మి.మీ వర్షపాతం నమోదైంది. దక్షిణ తమిళనాడు నుంచి పశ్చిమ విదర్భ వరకు గల ద్రోణి మరోవైపు కేరళ నుంచి ఉత్తర తెలంగాణ వరకూ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ దక్షిణ గాలుల ప్రభావంతో విశాఖలో వర్షాలు, చల్లని గాలులు వీచాయి. బుధవారం రోజంతా వాతావరణం చల్లగాను, ఆకాశం నల్లని మబ్బులతో ఆహ్లాదపరిచింది. కొన్నిచోట్ల వర్షాలు మరో రెండు రోజుల వరకూ కురిసే అవకాశాలు ఉన్నాయని అమరావతి, విశాఖపట్నం వాతావరణ కేంద్రాలు బుధవారం తెలిపాయి. తేలికపాటి వర్షాలు కొన్నిచోట్ల, అక్కడక్కడా ఉరుములు, మెరుపులూ ఉంటాయి. విశాఖలోని పలుచోట్ల వర్షాలకు జనం బయటకు రాలేని పరిస్థితి కూడా నెలకొంది.

కెకె.లైన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

▶ వార్త 2లో..

ఎన్నికల కోడ్ అమలులో కొనసాగుతోన్న నిర్లక్ష్యం

▶ వార్త 3లో..

మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలి

▶ వార్త 5లో..

కాగిత టోల్‌గేట్ వద్ద రూ.2 లక్షల నగదు సీజ్

▶ వార్త 7లో..

నగరంలో చెడ్డీ గ్యాంగ్ జాడలు

అప్రమత్తంగా ఉండలని పోలీస్ శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో గడిచిన 4 రోజులుగా నలుగురు సభ్యుల 'చెడ్డీ గ్యాంగ్' ముఠా తిరుగుతోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ఇటీవల విజయనగరం జిల్లా రామభద్రపురం, విశాఖలోని పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఈ ముఠా సభ్యులు సంచరించారని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వారి జాడలున్నాయని, ప్రధాన రహదారులకు సమీపంలోని ఇళ్లను టార్గెట్ చేసి, ప్రధాన ద్వారాలకు కన్నం పెట్టి తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించి ఇంట్లోని వ్యక్తుల్ని భయభ్రాంతులకు గురిచేసి బంగారం, డబ్బు దోచుకుపోతుంటారని వివరించారు. ఈ ముఠా విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉంటున్న వారంతా అపరిచితులు కనిపిస్తే తక్షణమే పోలీస్ కంట్రోల్ రూము నెంబర్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.



చెడ్డీ గ్యాంగ్ ముఠాతో పోలీసులు ముద్రించిన పోస్టర్

వర్షంలోనూ ఉబర్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలోని ఉబర్ డ్రైవర్లు 3వ రోజైన బుధవారం కూడా సమ్మె కొనసాగించారు. సమ్మెలో భాగంగా వర్షం కురుస్తున్నా నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన రేట్లు తగ్గించకూడదని, చట్ట ప్రకారం కంటే అదనంగా కమిషన్ తీసుకోవడం అపాలని, ఉబర్‌లో ఫ్లాట్ ఫామ్ ఫీస్ 39 తీసివేయాలి,వే బిల్ చూపించాలని డిమాండ్ చేశారు. ఉబెర్‌లో నెగిటివ్ బ్యాలెన్స్ రూ.1000కు మించి ఉండాలని, బుకింగ్ యాప్‌లో ఎస్‌యువి పెట్టాలని, నైట్ ఫెయిర్స్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 50 శాతం ఇవ్వాలని, ఇంటర్సిటీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ క్యాబ్ డ్రైవర్ యూనియన్ నాయకులు కె.పోలినాయుడు, ఆనంద్, అబ్బాయి, మనోహర్, రామ్మోహనం, సిమ్మ శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉబర్ డ్రైవర్లు

సమస్యలు పరిష్కరించాలి : ఆర్‌కెఎస్‌వి.కుమార్

ఉబర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. నగర వ్యాప్తంగా ఉబర్ డ్రైవర్లు మూడు రోజులుగా సమ్మె చేస్తున్నారన్నారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు వెంటనే కల్పించుకొని కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేసే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'తూర్పు'లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గానికి (21) సంబంధించి కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి, డిప్యూటీ కలెక్టరు స్థాయి అధికారిని, ఇతర సిబ్బందిని నియమించినట్లు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మయూర్‌అశోక్ తెలిపారు. ఆసీల్‌మెట్టలోని జోన్-3 కార్యాలయంలో 24 గంటలూ పనిచేస్తుందని వివరించారు. సామాన్య ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎవరైనా సమస్యలను ఫోన్ ద్వారాగాని, నేరుగా గాని ఫిర్యాదు చేసిన వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు 0891-2746314 సంప్రదించాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

వివిఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఏరినాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో బుధవారం రిటర్నింగ్ అధికారి సమావేశం నిర్వహించారు. హాజరైన ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు.

వాలంటీర్ తొలగింపు

ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న విషయమై ఈనాడు దినపత్రికలో బుధవారం ప్రచురితమైన వార్తపై విచారణ జరిపి సచివాలయం 10860958 చెందిన వాలంటీర్ పి.కరుణను విధుల నుండి తొలగించినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లను ఎట్టి పరిస్థితులలో అనుమతించబోమని స్పష్టం చేశారు.

డిఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు ఆధ్వర్యాన ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే డిఆర్ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ సమక్షంలో విడుదల చేశారు. విశాఖపట్నంలోని వాల్తేరు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్లడ్ లైట్ల కింద పగలు, రాత్రి తేడా లేకుండా మ్యాచ్‌లు జరగనున్నాయని వారు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మహిళలు, పురుషుల విభాగంలో వివిధ రాష్ట్రాలు, సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 8 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో-ఆర్డినేషన్) ఎకె.మొహరానా, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ మోటార్ ఇండియా - జెఎస్‌డబ్ల్యు ఎంఒయు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంజీ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జెఎస్‌డబ్ల్యు గ్రూప్ మధ్య ఒప్పందం ఖరారైందని ఎంజీ మోటార్ ఇండియా విశాఖపట్నం సేల్ హెడ్ జాన్సన్ తెలిపారు. బీచ్ రోడ్డులోని ఎంజీ మోటార్స్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం 1,00,000 నుంచి సంవత్సరానికి 3,00,000 వాహనాలకు పెంచడమే లక్ష్యమని తెలిపారు. ఈ పండుగ సీజన్ నుంచి ప్రతి మూడు నుంచి ఆరు నెలలకు ఒక కొత్త వాహనాన్ని వినియోగదారులకు అందజేస్తామని చెప్పారు. త్వరలో ప్రీమియం ప్యాసింజర్ వెహికల్ మార్కెట్లో కూడా ప్రవేశించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు.

రియల్ మీ నార్జో 70 ప్రో 5 జి విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తక్కువ కాంతిలో ఫొటోగ్రఫీ ప్రమాణాలతో రియల్ మీ నార్జో 70 ప్రో 5 జిని లాంచ్ చేసినట్లు రియల్ మీ ప్రతినిధి తెలిపారు. రూ.18,999 ప్రారంభ ధర అని తెలిపారు. రియల్ మీ నార్జో ఒక స్టైలిష్ స్మార్ట్ ఫోన్ అన్నారు. వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని ఇస్తుందన్నారు.

తూర్పులో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధి 22వ వార్డు పిఠాపురం కాలనీ ప్రాంతంలో తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు తరుపున ఆయన సతీమణి సుజన బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు తెలుగు యువత ఉపాధ్యక్షులు పీతల అఖిల్, పెనలు శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇసుజు ఐ-కేర్ 'సమ్మర్ క్యాంప్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇసుజు మోటార్స్ ఇండియా డి మ్యాక్స్ పిక్ అప్స్ ఎస్‌యువిల శ్రేణి వాహనాల కోసం దేశ వ్యాప్త 'ఇసుజు ఐ-కేర్ సమ్మర్ క్యాంప్'ను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రాంతీయ అధికారి లలిత్‌పాండే చెప్పారు. బీచ్ రోడ్డులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వేసవిలో సమస్యా రహితమైన డ్రైవింగ్ కోసం ప్రివెంటివ్ మెయింటెనెన్స్ చెకప్ అందించడమే ఈ సర్వీస్ క్యాంప్ ఉద్దేశమని వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 22 నుండి 29వ తేదీ వరకు అన్ని ఇసుజు అధీకృత డీలర్ సర్వీస్ అవుట్‌లెట్లలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ బుకింగ్ కోసం సమీప ఇసుజు డీలర్ అవుట్‌లెట్‌కు కాల్ చేయవచ్చని, లేదా https://isuzu.in/service-booking/ ను సందర్శించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4199 188కు కాల్ చేయవచ్చని తెలిపారు.

'దక్షిణ' జనసేనలో జగడం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జనసేనలో అభ్యర్థి ప్రకటన ఇంకా వెలువడక ముందే విశాఖ దక్షిణ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరాయి. జనసేనలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్‌ను విశాఖ దక్షిణ అభ్యర్థిగా ప్రకటిస్తారనే సమాచారంతో తొలి నుంచి పార్టీలో ఉన్న గ్రూపు ఆందోళనకు దిగింది. నియోజకవర్గ పరిధిలోని గీత్ సంగీత్ థియేటర్ వద్ద జనసేన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు. ఎక్కడి నుంచో తీసుకొచ్చిన వంశీకృష్ణశ్రీనివాస్‌ను తమ నెత్తి మీద పెట్టడం ఎంతవరకు సమంజసం అంటూ ఒక వర్గం వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీని నమ్ముకొని నియోజకవర్గంలో పనిచేస్తూ వస్తున్న వారిని కాదని నిన్నకాకమొన్న వచ్చిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసంటూ మండిపడుతున్నారు. వంశీకృష్ణకు సీటు వద్దు స్థానికులు ముద్దు అంటూ వంశీకృష్ణ శ్రీనివాస్ ఫొటోలను దక్షిణ నియోజకవర్గ జనసేన నేతలు మూగి శ్రీనివాస్, కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ గ్రూపు నాయకులు తగలబెట్టడంతో వివాదం చోటుచేసుకుంది.

తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన అధిష్టానం ప్రకటించిందంటూ వంశీకృష్ణశ్రీనివాస్ ప్రచారాన్ని ముమ్మురం చేసుకుంటున్నారు. దక్షిణంలో పార్టీ కార్యాలయం కూడా తెరిచారు. వంశీకృష్ణ అభ్యర్థిత్వం పూర్తిస్థాయిలో ఖరారు కాలేదని, స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలంటూ కార్పొరేటర్ సాధిక్ చెబుతూ వస్తున్నారు. రెండ్రోజుల క్రితం మీడియా సమావేశం కూడా నిర్వహించి సాధిక్ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జ్ఞానాపురంలో సాధిక్ గ్రూపు వంశీకృష్ణ గ్రూపు మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఒకరిని ఒకరు దూషించుకున్నారు. కొందరు చేయి కూడా చేసుకున్నారు.

సాదిక్ కార్యాలయం వద్ద గొడవ

జివిఎంసి 39వ వార్డు లక్ష్మీ టాకీస్ దగ్గర ఉన్న కార్పొరేటర్, జనసేన నాయకుడు మహమ్మద్ సాదిక్ కార్యాలయం వద్ద బుధవారం జనసేన ఇరు వర్గాల మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. వంశీకృష్ణ శ్రీనివాస్ గ్రూపునకు చెందిన 50 మంది జనసేన కార్యకర్తలు వచ్చి తమ నాయకుని ఫొటోలు ఎందుకు కాల్చారని, ఎందుకు పార్టీలో విభేదాలు తెస్తున్నారని, సాదిక్ కార్యాలయం దగ్గర ఉన్న కార్యకర్తలను ప్రశ్నించారు. పివి శివప్రసాద్ రెడ్డి, 33వ వార్డు జనసేన కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి భర్త గోపీకృష్ణ, తెలుగు లక్ష్మి తదితరులు సాదిక్ గ్రూపు నేతలను నిలదీశారు. దీంతో సాధిక్ గ్రూపు నాయకులు వారిపై ఎదురు దాడికి దిగారు. సాధిక్ నాయకత్వం వర్ధిల్లాలని కొందరంటే, వంశీకృష్ణ నాయకత్వం వర్ధిల్లాలని మరికొందరు నినాదాలు చేశారు. మొదటి నుంచి నియోజకవర్గంలో జనసేన పార్టీ కోసం పనిచేస్తున్న మహమ్మద్ సాదిక్, కందుల నాగరాజు, ఎం.శ్రీనివాసరావులలో ఎవరో ఒకరికి టికెట్ ఇవ్వకుండా, వేరే నియోజవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఇక్కడి టికెట్టు ఎందుకు ఇస్తారని వారు నిలదీశారు. స్థానికులకు ఇస్తేనే పనిచేస్తామని సాధిక్ గ్రూపు వర్గీయులు స్పష్టంచేశారు. తీవ్రస్థాయిలో గొడవ జరుగుతున్న సంగతి తెలియడంతో పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి పంపించేశారు.

రెండు గ్రూపుల మధ్య డిష్యుం డిష్యుం



'దక్షిణం'లో రెండు గ్రూపుల మధ్య వివాదం

జగన్మోహన్‌రెడ్డి ఓటమే ధ్యేయం

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీముత్యాలరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓటమే ధ్యేయంగా రానున్న ఎన్నికలలో పనిచేస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీముత్యాలరావు చెప్పారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తమ సంఘం ద్వారా గత మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నాయని, రాజకీయాలకు అతీతంగా అసెంబ్లీ ముట్టడి చేశామని తెలిపారు. ఇక మీదట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్పంచులు, ప్రజలకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. ఒక పద్దు కింద రూ.4 వేల కోట్లు నిధులు బకాయి పెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మీద రూ. 8,629 కోట్లు బకాయి ఉందని తెలిపారు. సంఘం ఆధ్వర్యాన 16 డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్నామన్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా సర్పంచులకు అధికారాలు పునరుద్ధరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సర్పంచుల డిమాండ్లను పరిష్కరించే రాజకీయపార్టీలకే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు సోమేశ్వరరావు, అప్పల రాజు, అమ్మోరు పాల్గొన్నారు.

'స్వాష్' విజేతగా విశాఖ విద్యార్థిని అక్షిత



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దేశవ్యాప్తంగా ఏడు నుంచి 14 ఏళ్ల బాలలకు యాక్సిస్ బ్యాంకు నిర్వహించిన వార్షిక ఆర్ట్, క్రాఫ్ట్ సాహిత్య పోటీ 'స్వాష్' విజేతగా విశాఖపట్నానికి చెందిన ప్రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని అక్షిత నిలిచారు. ఈ పోటీలకు సంబంధించి మొత్తం ఆరుగురు విజేతలుగా నిలిచారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున స్కాలర్‌షిప్‌తో పాటు భాగస్వాములైన హ్యామ్‌లీస్, ఫేబర్ క్యాజిల్, అమెరికన్ టూరిస్టర్, బోట్ వంటి సంస్థల నుంచి ఆకర్షణీయమైన హ్యాంపర్లు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు లభిస్తాయని యాక్సిస్ బ్యాంకు ప్రతినిధి అనూప్ మనోహర్ చెప్పారు. రన్నర్లకు చెరో రూ. 50 వేల బహుమతి లభిస్తుందన్నారు.

కెకె లైన్‌లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కెకె.లైన్‌లో లెవెల్ క్రాసింగ్, శివలింగపురం రైల్వే స్టేషన్ వద్ద డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్, సీనియర్ అధికారులతో కలిసి డివిజనల్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం సిబ్బందితో మాట్లాడి గేటు వద్ద ఉన్న అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం శృంగవరపుకోట - బొడ్డవర మధ్య లెవల్ క్రాసింగ్ గేటు కె 17ను భద్రతా తనిఖీ చేశారు. బొడ్డవర స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి రైలు రాకపోకల్లో భద్రత, స్టేషన్‌లో సౌకర్యాలను, యార్డు లేఅవుట్‌ను పరిశీలించారు. శివలింగాపురం స్టేషన్ యార్డు వద్ద భద్రతా ఆడిట్ నిర్వహించారు. ట్రాక్‌లు, రిలే రూమ్, బ్యాటరీ రూమ్ సిగ్నల్స్‌కు సంబంధించిన వివిధ భద్రతా అంశాలను డిఆర్ఎం పరిశీలించారు.

ఎంవిపిలో ఎంవివి ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి 19వ వార్డు పరిధి ఎంవిపి.కాలనీ సెక్టార్-12లో తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఎంవిపి.కాలనీలో జయభారత్ పార్టీ నేషనల్ వ్యవస్థాపకులు వి వి . ల క్ష్మీ నా రా య ణ ను ఎంవివి.సత్యనారాయణ కలిసి తమకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. 66వ రోజు పాదయాత్రలో భాగంగా బుధవారం ఎంవిపి.కాలనీ, లాసన్స్ బే కాలనీ ప్రాంతాల్లో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ లక్ష్మీదాస్‌తో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తనే ధ్యేయం!

కేంద్ర కారాగారంలో సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రం



విశాఖ కేంద్రకారాగారం

ప్రజాశక్తి - ఆరిలోవ : నేరాలు చేసి జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో కొంతమంది తాము చేసిన తప్పులు తెలుసుకొని పరివర్తన చెంది, విడుదలైన తరువాత మంచి జీవితం మొదలు పెడితే మంచిదే. కానీ చాలామంది రిమాండులో ఉన్న సమయంలో మరికొంత మంది కరుడు కట్టిన ఖైదీలతో సహవాసం చేయడం, జైలుకు వెళ్లిరావడం ఇదొక ప్రమోషన్‌గా భావించి బయటకు వచ్చిన తరువాత మరిన్ని నేరాలు చేసేందుకు ఒడిగడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, వారిలో పరివర్తన తీసుకొచ్చేందుకు జైళ్ల శాఖ అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా వచ్చిందే సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రాలు. దేశంలో మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ కేంద్రకారాగారాల్లో ఈ తరహా కేంద్రాలు ఏర్పాటుచేస్తోంది. ఈ కేంద్రంలో సామాజిక కార్యకర్తలు, వైద్యులు, బ్యాంక్ అధికారులు, లాయర్లు, మానసిక నిపుణులు, ఆర్థిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. వీరంతా ఒక కమిటీగా పనిచేస్తారు.

ఇంక్యుబేషన్ కేంద్రం పనితీరు

సోషల్ ఇంక్యుబేషన్ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన ఖైదీలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేస్తారు. ఖైదీ స్థితిగతులపై అధ్యయనం చేస్తారు. ఖైదీలు నేరానికి పాల్పడిన పరిస్థితులు, నేరం చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది తదితర విషయాలను తెలుసుకుంటారు. శిక్షాకాలంలో వారి మానసిక పరిస్థితి, వారిలో వచ్చిన మార్పులను గుర్తిస్తారు. వారు బయటకు వెళ్లాక దేనికి పనికొస్తారో ఒక అవగాహనకు వస్తారు. ఖైదీల పట్ల సామాజిక దృక్పథం, వారు సేవాభావంతో మెలిగేవిధంగా చేయడం, ఖైదీలకు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమం, సహాయ సహకారాలు అందించడం ప్రధాన లక్ష్యంగా కమిటీ సభ్యులు పనిచేస్తారు. ఖైదీల జీవితం, భవిష్యత్తుపై అవగాహన కల్పించడం, ఖైదీల కుమార్తెల వివాహాల విషయంలో సహకారం అందించడం, వారి పిల్లల విద్యాభివృద్ధిలో సహాయం చేయడం, ఖైదీలకు చేతి వృత్తిలో శిక్షణ ఇచ్చి బయటకు వచ్చిన తరువాత బ్యాంకులు రుణాలు అందించి సహాయపడటం తదితర వాటి గురించి ఈ కేంద్రంలోని కమిటీ పనిచేస్తుంది.

జైళ్లశాఖకు నివేదిక..

కమిటీ సభ్యులు ఖైదీలతో మాట్లాడిన తరువాత వారిపై పూర్తి నివేదిక తయారుచేస్తారు. నేరానికి పాల్పడిన సందర్భం, జైల్లో వచ్చిన మార్పులు, శిక్ష పూర్తయి బయటకు వెళ్లాక ఆ వ్యక్తి ఏ వృత్తికి పనికొస్తాడు.. వారిలో దాగి ఉన్న నైపుణ్యం తదితర అంశాలతో ఒక రికార్డు తయారు చేసి, దానిని జైలు అధికారులకు అందజేస్తారు.

ఖైదీల ప్రయోజనమే లక్ష్యం



తెలిసో, తెలియకో క్షణికావేశంలో చేసిన నేరానికి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు పరివర్తన చెంది, తిరిగి బయటకు వచ్చిన తరువాత గతంలో చేసిన తప్పులను మరలా చేయకుండా కుటుంబ సభ్యులకు, సమాజానికి ఉపయోగపడేలా చేయాలి. ఈ ఉద్దేశంతో సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పడింది. ఖైదీల పరివర్తన, వారిలో దాగి ఉన్న నైపుణ్యం గుర్తించడం, వారి సమస్యలు పరిష్కరించడం, బయటకు వెళ్లాక చక్కగా జీవించడమే కాకుండా దేశానికి ఒక మంచి మానవవనరుగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు
ఐజి, జైళ్ల శాఖ

బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికులంతా బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ కోరారు. బుధవారం సిఎండి కాన్ఫరెన్స్ హాల్లో అఖిలపక్ష కార్మికసంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఏప్రిల్ నెలాఖరు వరకు బయోమెట్రిక్ (బార్స్) విధానంతోపాటు మ్యాన్యువల్‌గా డార్స్ పద్ధతిని అమలు చేస్తామన్నారు..ఈ నెల8 నుంచి అమల్లోకి వచ్చిన బార్స్ విధానంలో హాజరు నమోదులో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినా, వాటన్నింటినీ సరిచేసి ఈ రెండు నెలలు అందరికీ సక్రమంగా వేతనాలు అందేలా చూస్తామని హామీఇచ్చారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ విధానం అమలులో ఉంటుందన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు జవహర్‌లాల్‌నగర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సంఘం సభ్యులు, మహిళలుతో కలిసి విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపిఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు బుధవారం ప్రారంభించారు. స్థానిక సంఘం సభ్యులతో పలు విషయాలు చర్చించారు. రానున్న ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలనికోరారు. వసంతల అప్పారావు, కర్రి రామారెడ్డి, అంబటి శైలేష్, రాజనాగంగరాజు, కండిపల్లి శ్రీను, భరత్, పద్మ, జగరపు అప్పారావు, అనిల్, చందు, జానకిరామ్, రామారెడ్డి, రాజు, ఈశ్వరరావు, నూకరాజు, సింహాద్రి, గాంధీ, శ్రీను, సతీష్, శేఖర్, కామేశ్వరరావు, పావని, పద్మ పాల్గొన్నారు.

24న 'గీతం' ఎంబిఎ ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న ఎంబిఎ కోర్సులలో ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్-2024 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. జిబాట్-2024 ప్రవేశ పరీక్షను ఈ నెల 24న దేశ వ్యాప్తంగా 80 పట్టణాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. రెండు గంటల కాలవ్యవధి, 200 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎంబిఎలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకౌంటింగ్ స్పెషలైజేషన్‌లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంబిఎ హెల్త్‌కేర్, హస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీలో ఉత్తీర్ణులై, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24న జరిగే జిబాట్-2024కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల కోడ్ అమలులో కొనసాగుతోన్న నిర్లక్ష్యం

నేతల ఫొటోలతో శిలాఫలకం ...అయినా పట్టించుకోని అధికారులు



భీమిలి తగరపువలస రోడ్డులో శిలాఫలకంపై యథావిధిగా నేతల ఫొటోలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎన్నికల కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కొనసాగుతూనే ఉంది. షెడ్యూల్ ప్రకటించి, మూడు రోజులు గడిచినా ఇంకా రాజకీయపార్టీల నేతల బొమ్మలతో బోర్డులు, శిలాఫలకాలు యథావిధిగా దర్శనమిస్తూనే ఉన్నాయి. మండలంలోని రేఖవాని పాలెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వేసిన శిలాఫలకంపై ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుత వైసిపి పోటీ అభ్యర్థి ముత్తంశెట్టి ఫొటోలు కనిపిస్తూనే ఉన్నాయి .భీమిలి, తగరపువలస ప్రధాన రహదారిలో అందరికీ కనిపించేలా ఉన్న శిలాఫలకంపై ఫొటోలు ఉన్నా వాటిని కప్పేందుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనిపై ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



పాలవలసలో ఓటర్లను చైతన్యపరుస్తున్న ఎన్ఎస్ఎస్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఎక్యూజె కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ప్రత్యేక సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరవ రోజున పాలవలస గ్రామంలో ఓటరు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ఆవశ్యకతను వివరించారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు కావాలని, జాబితాలో పేరున్న అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పిఒ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

22 న దాఖలుకు తుది గడువు

ఒచీశీఅవం(ప్రజాశక్తి - విశాఖ లీగల్ : ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 22 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉందని ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది కె.నరసింహమూర్తి తెలిపారు. బుధవారం తొలిరోజున పలువురు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసిన వారిలో అధ్యక్ష పదవికి నమ్మి సన్యాసిరావు, తాళ్లూరు రవికుమార్ నామినేషన్లు వేయగా, ఉపాధ్యక్ష పదవికి ఎస్‌టిపి గోపాలక్ష్మ, ప్రధాన కార్యదర్శిగా కె రవిశంకర్, గుడిపల్లి సుబ్బారావు, కోశాధికారి పదవికి టి.బోసుబాబు, జాయింట్ సెక్రెటరీ పదవికి అడపా సుధాకర్ నామినేషన్ దాఖలు చేశారు. జూనియర్ మెంబర్లుగా కె శ్రీనివాసరావు, వి కుమారస్వామి, ఎం వెంకటరమణ, పి రమాదేవి, సీనియర్ సభ్యురాలిగా కె హేమామాలిన నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి నరసింహమూర్తి వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేలు, పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని చీడికలో మంగళవారం రాత్రి కోడిపందేలు, పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.51,429 నగదు సీజ్ చేసినట్లు సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు .

చెడ్డీగ్యాంగ్‌తో జాగ్రత్త సుమా!



అనుమానితుల ఫొటోలతో బ్యానర్ విడుదల చేస్తున్న క్రైం ఎస్ఐ

ప్రజాశక్తి -భీమునిపట్నం : చెడ్డీ గ్యాంగ్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక నేర విభాగం ఎస్ఐ ఎస్ సూర్య ప్రకాశరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పద్మనాభం మండలం ఐనాడలో ఇటీవల చెడ్డీ గ్యాంగ్ ముఠా ఇంట్లో ప్రవేశించి దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో అనుమానితుల ఫొటోలతో కూడిన బ్యానర్‌ను నేర విభాగం పోలీసులు ప్రదర్శించారు. జివిఎంసి తగరపువలస, భీమిలి మండలం తాళ్ళ వలసలో బుధవారం ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రచారం చేశారు. ముఖ్యంగా చిన్నారులు,వృద్ధులు, మహిళలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు ఇంట్లో విలువైన వస్తువులను ఉంచవద్దని స్పష్టం చేశారు

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎసిపి సునీల్

ప్రజాశక్తి -ఆనందపురం :రానున్న ఎన్నికలు దృష్ట్యా మహిళా పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎసిపి బి.సునీల్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల సమయంలో జాగ్రత్తలు వహించి, శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే అప్రమత్తపై పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆనందపురం సిఐ టివి.తిరుపతిరావు. ఎస్ఐ గంట్యాడ సంతోష్, సిబ్బంది గాంధీ పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ లక్ష్యం

ప్రజాశక్తి-వేపగుంట/పెందుర్తి : మానవ హక్కులపై బడుగు, బలహీన వర్గాలు, ఆదివాసీలకు అవగాహన కలిస్తూ, వాటి పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు జైభారత్ ఐహెచ్ఆర్‌సి వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు రాజాన ప్రసాదరావు అన్నారు. బుధవారం జివిఎంసి 94వ వార్డు నాయుడుతోటలోని సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమసమాజ స్థాపన, దేశ అభ్యుదయానికి కృషి చేయడమే సంస్థ లక్ష్యమని పలువురు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి పిఐఎన్ రాజు, కార్యదర్శి ఆర్ ఇషిత, సలహాదారు రవికుమార్, కోశాధికారి ఆర్, విజయ, మధు.జె.రాజ్, రాష్ట్ర అధ్యక్షులు వై శ్రీనివాస్, వి మురళి, బి రమేష్ కుమార్ ఎ.బాబు, వివిధ జిల్లాల అధ్యక్షులు వై హరి పవన్‌కుమార్, బి రమేష్‌కుమార్, జి శ్రీనివాస్, బి డేవిడ్, పి హేమలత, బి రమేష్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జివిఎంసి క్లాప్ డ్రైవర్లు, లోడింగ్ కార్మికుల

హక్కుల సాధనకు పోరాటం

- సర్వసభ్య సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



మాట్లాడుతున్న వెంకటరెడ్డి, పక్కనే సిపిఎం నేత జగ్గునాయుడు

ప్రజాశక్తి - గాజువాక : జివిఎంసి క్లాప్ డ్రైవర్లు, లోడింగ్ కార్మికుల సంపూర్ణ హక్కుల సాధనకు పోరాటం తప్పదని, కార్మికుల న్యాయపోరాటానికి భవిష్యత్‌లోనూ సిపిఎం అండగా ఉంటుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు స్పష్టం చేశారు. బుధవారం గాజువాక జోన్ పరిధిలోని క్లాప్ డ్రైవర్లు, లోడర్ కార్మికుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికులను యాజమాన్యాలకు కట్టుబానిసలను చేసేందుకు కేంద్రం లోని మోడీ ప్రభుత్వం పూనుకుందని దుయ్య బట్టారు. రైతులు, ప్రజల త్యాగాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, దీంతో విశాఖ అభివృద్ధికి విఘాతంతోపాటు, వేలాది మంది కార్మికులు, నిర్వాసితులకు నష్టం తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి, ప్రభుత్వరంగ సంస్థలకు, కార్మికులకు ద్రోహం చేస్తున్న బిజెపిని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి హాని చేస్తున్న బిజెపిని నిలదీయాల్సిన అధికార వైసిపి, విపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు కార్మికుల, ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా బిజెపితోనే అంటకాగడం దుర్మార్గమన్నారు.

యూనియన్ గౌరవాధ్యక్షులు పి వెంకటరెడ్డి, క్లాప్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు సుగుణాకరరాజు, ప్రధాన కార్యదర్శి ఒ.సురేష్, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కార్మిక హక్కులకు విఘాతం కలుగుతూనే ఉందని, సమ్మెలు, పోరాటాలు చేస్తే నిర్బంధాలు కొనసాగిస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో అధికార వైసిపితోపాటు ప్రధాన విపక్షాలు టిడిపి, జనసేన, బిజెపికి సరైన గుణపాఠం చెప్పాలని కార్మికులను కోరారు. వచ్చే ఎన్నికల్లో పోటీలో నిలిచే కార్మిక నేతలను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధు, రాంబాబు, గిరి, పైడ్రాజు, గొలగాని అప్పారావు, నాగరాజు, మీనాక్షి ,చిన్నారావు, హేమకుమార్, 19 వార్డుల కార్మికులు, క్లాప్‌డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు, పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీపై ఇంటింటా ప్రచారం



సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడవ వార్డు తోటవీధిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. బిసి కార్పొరేషన్ ద్వారా మత్స్య కారులకు వేట సామగ్రి కొనుగోలుకు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేస్తామని భరోసానిచ్చారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చురకల రమణ, ఎ గుర్నాధరావు, నాయకులు బి.రమేష్, వి.రాంబాబు, కె.పరదేశి పాల్గొన్నారు

'పంచకర్ల' ఎన్నికల ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి- పెందుర్తి :మండలంలోని సరిపల్లి గ్రామంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లికార్జునస్వామిని టిడిపి, బిజెపి, జనసేన కూటమి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిపల్లి నుంచి ప్రచారం ప్రారంభిస్తే మంచి జరుగుతుందన్న నమ్మకంతో మల్లికార్జునుని దర్శించుకుని ప్రచారానికి శ్రీకారం చుట్టానన్నారు. త్వరలోనే పార్టీ పెద్దలందరినీ కలిసి వారి ఆశీర్వాదం తీసుకొని, అందరితో కలిసి ప్రచారంలోకి పూర్తిస్థాయిలో వెళతామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం, ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గండ్రెడ్డి రమేష్, కోనేటి సాంబశివ, నీలంశెట్టి సాయికిరణ్, దెందేటి కృష్ణ, కలిగి దేవుళ్లు,తెలుగుదేశం, జనసేన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల వార్షికోత్సవంలో 'పల్లా'

ప్రజాశక్తి-ఉక్కునగరం: 87 వ వార్డు లక్ష్మీపురం కాలనీలో దుర్గాంబ, నూకమాంబ, పోలమాంబ త్రిశక్తి దేవాలయాలు, కాశీ పాలెం సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని గాజువాక నియోజవర్గ అభ్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి 87 వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజాన రాజు, డివి అప్పారావు, పావడ రమణమూర్తి, దుగ్గాపు రాజేంద్ర, దొంగ్గ వెంకయ్య పెయింటర్ కృష్ణ, కమిటీ సభ్యులు అవిరెడ్డి సూర్యనారాయణ, సిరసపల్లి బాబూరావు, కాశీపాలెం కమిటీ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, సాంబశివరావు, ఎన్నింటి సంతోష్, రామరాజు పాల్గొన్నారు

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని కణమాం గ్రామంలో బుధవారం అభయాంజనేయస్వామి విగ్రహ యంత్ర శిఖర ప్రతిష్ట ఘనంగా జరిపారు. కోలాటం, డ్రమ్స్, రామ భజనలతో పురవీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. విశాఖ ఉత్తర టిడిపి ఎమ్మెల్యే గంటా.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. ఆలయం వద్ద 3500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పల రాము, సురేందర్ రెడ్డి, చిక్కాల విజయబాబు, ఎర్ర రాము, చందరపు కుమార్, ఎర్ర పైడిరాజు, సురాల సత్య వరప్రసాద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా

డైట్‌లో ఘనంగా పిచ్చుకల దినోత్సవం



మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, పిచ్చుకలు ఆహారంగా తినే చిన్న క్రిములు, కీటకాల వల్ల జీవ వైవిధ్య సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. పంట పొలాలకు చీడపీడల నుంచి ముప్పు తగ్గించి, ఆహార భద్రతకు పిచ్చుకలు దోహదపడతాయన్నారు. దాదాపు 35 జాతుల పిచ్చుకలు పక్షుల్లో చిన్నవిగా ఉంటాయని, గంటకు 50 కిలో మీటర్ల వేగంతో ఎగురుతాయని వివరించారు. జీవవైవిధ్యానికి మేలు చేసే పిచ్చుకల ఉనికి నేడు ప్రశ్నార్థకంగా మారిందని, దానికి మానవాళి జీవనశైలి కారణం కావడం గమనార్హమన్నారు. ఛాత్రోపాధ్యాయిని రితీషా మాట్లాడుతూ, నేటి జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంగా పరిణమించాయన్నారు. పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, మితిమీరిన రసాయనాల వినియోగం, సెల్‌టవర్ల రేడియేషన్ పిచ్చుకల జాతి అంతానికి కారణభూతమౌతోందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ త్రినాథరావు, ఎం మహాలక్ష్మి, జె మాధవి పాల్గొన్నారు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి అమర్

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్రమంత్రి, వైసిపి అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం వడ్లపూడిలో పార్టీ ముఖ్యనేతలు, శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశాన్ని వైసిపిపై నెట్టేయాలని చూసిన టిడిపి, జనసేనలు, ఇపుడు ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తీసుకున్న బిజెపితో జత కట్టారన్నారు పార్టీ విజయానికి బూత్‌స్థాయిలో కేడరంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక ఎమ్మెల్యేగా అమర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, వర్రి రాజు, బలిరెడ్డి , కాంగ్రెస్‌గుల అప్పారావు పాల్గొన్నారు.

సమిష్టిగా ముందుకు సాగుదాం

- ఉత్తర నియోజకవర్గ వైసిపి అభ్యర్థి రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు కోరారు. బుధవారం 47వ వార్డు కప్పరాడ, 54వ వార్డు మర్రిపాలెంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, చల్లా రజనీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో వార్డు వైసిపి ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, రానున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు, కార్యకర్తలను సమన్వయపరుస్తూ ముందుకు సాగుదామన్నారు. జివి.రమణి, కె.పీరత్నాకర్, అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, చిరంజీవి, సుకుమార్, కోరుబిల్లి విజయ్, కృప, రాఘవులు, లక్ష్మణ్, సురేష్, రమేష్, కనకరాజు, సుధ, అనిల్, చందు, భోగి సాయి, పవన్, మురళి, ప్రసాద్, హరి, నర్సింగ్, సాగర్, వై.రమేష్, తారకేసు, దమయంతి, ప్రశాంతి, అనసూయ, సంతోషి, అరుణ్, ఆనంద్,బుల్లిబాబు, నూకరాజు, రామకృష్ణ, అచ్యుత రావు, రాధాకృష్ణ, కల్యాణ్, దంతు, హరినాథ్, హనుమంత రావు, మోహన్, శంకర్, రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పిఒ అనసూయాదేవి

ప్రజాశక్తి-ములగాడ : ప్రకృతి, పారిశ్రామిక వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రచారం చేయాలని సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి పిలుపునిచ్చారు. బుధవారం. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల యూనిట్ 1,2 ఆధ్వర్యంలో ఇందిరాకాలనీ, బర్మా కాలనీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాలలో మాట్లాడుతూ, వైపరీత్యాలు పట్ల అప్రమత్తంగా ఉంటే, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలమన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆహారం, నీరు, వసతి సౌకర్యాల కల్పనలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలని కోరారు. అనంతరం గ్రామీణాభివృద్ధిలో యువత పాత్రపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా ఎన్ఎస్ఎస్ పిఒ ఇపిఎస్ భాగ్యలక్ష్మి వ్యవహరించారు. అంతకుముందు ఇందిరా కాలనీ, బర్మా కాలనీలలో ఆడపిల్లలను ఆదరించాలని, వారిని చదివించాలని ఇంటింటా ప్రచారం చేశారు. దేశభక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమాలను జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ.సంధ్యారాణి, నదియా సమన్వయం చేశారు.

ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలను తీసుకెళ్లాలి

- బూత్ ఇన్‌ఛార్జిల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలను తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త, బూత్ ఇన్‌ఛార్జిలు కృషిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పిలుపునిచ్చారు. బుధవారం 87 వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు తథ్యమని, అధికారం చేపట్టగానే అమలుపరిచే సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు పూర్తిగా వివరించాలని సూచించారు. పేర్లు మార్పుచేసి, లేని పథకాలను మభ్యపెట్టి మోసపుచ్చిన అధికార పార్టీ తీరును ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు రాజాన రాజు, క్లస్టర్ ఇంచార్జ్ విజయరామరాజు, సెక్రటరీ సత్తిబాబు జిల్లా నాయకులు కర్రి కన్నారావు, వర్రే రాంబాబు, కల్లేపల్లి శ్రీనివాసవర్మ, సీనియర్ నాయకులు ప్రగడ దానయ్య,పావడ రమణమూర్తి,నూరిశెట్టి పెంటారా, ద్రోణాద్రి అప్పలనాయుడు,జీవి రమణ,జోసెఫ్, దాలయ్య, బొడ్డా సన్యాసి, పీవీఎన్. మూర్తి, దుగ్గపు రాజేంద్ర ప్రసాద్, కాంగ్రెస్‌గుల శ్రీను, కల్లేపల్లి అశోక్ వర్మ,దొగ్గ పెంటయ్య, గండేపల్లి రాము, గండేపల్లి శ్రీను, సైకిల్ షాప్ రాజు,జాన్ రమేష్, సంగ్రనా సూరిబాబు, ఆటో సూరిబాబు, ఆరంగే చిన్న బాబు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రణాళికపై వైసిపి సమావేశం

ప్రజాశక్తి- పద్మనాభం : వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యాచరణపై చర్చించేందుకు బుధవారం మండల పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మహేష్ ఆధ్వర్యంలో పార్టీ మండల ప్రెసిడెంట్ కోరాడ లక్ష్మణరావు అధ్యక్షతన వైసిపి ఎన్నికల ప్రణాళిక సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విజయానికి చేపట్టాల్సిన చర్యలపై పార్టీ నేతలు, కార్యకర్తల సలహాలు, సూచనలు స్వీకరించారు.ఎంపిపి రాంబాబు, జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్ గిరిబాబు, ౦ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్

- భయభ్రాంతులకు గురవుతున్న వి.ఎల్.ఎన్.పురం గ్రామస్తులు
- పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని పి.బోనంగి పంచాయితీ శివారు విఎల్ఎన్.పురం గ్రామంలో బోయమాంబ ఆలయం సమీపంలో అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శిథిలావస్థలో ఉంది. ఇది ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని అంగన్వాడీ కేంద్రానికి తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించడం మానేశారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గతంలో గ్రామస్తులు చందాలు వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు పది అడుగుల సిమెంట్ దిమ్మను కూడా కట్టారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు మార్చేందుకు విద్యుత్ శాఖ ఎఇ సిద్ధమయ్యారు. మూడు నెలల కావస్తున్నా నేటికీ మార్చేందుకు మొగ్గు చూపడం లేదు. విద్యుత్ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇదే..



శోబన్‌బాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా శోభన్‌బాబు వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి విజయరామరాజుపేటలో బుధవారం ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు 16 వర్ధంతి వేడుకలు ఆలిండియా శోభన్ బాబు అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా శోభన్ బాబు చిత్రపటానికి విజయరామరాజుపేట పెద్దలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలక రాము, ఆళ్ల శివరామ సత్యనారాయణ, కొయిలాడ జగప్పారావు, పిల్ల శ్రీను, పిట్ల రాజు, ఒమ్మి రాము, ఆడారి జగ్గారావు, పిల్ల సూర్యనారాయణ, పి రమణమూర్తి, పెట్ల సూర్యారావు, ఆళ్లసూర్య రామకృష్ణ పసుపులేటి అప్పారావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఉషోదయలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చోడవరం

జెర్రిపోతుల రమణాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక డైరెక్టర్ రమణాజీ మాట్లాడుతూ తమ కాలేజీలో ఇప్పటివరకు 19 మార్లు రక్తదాన శిబిరం నిర్వహించమన్నారు. రక్తదానం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చునని తెలిపారు. విశాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవికుమార్, వెంకట వాసు విద్యార్థులు పాల్గొన్నారు .

ఉగ్గినిపాలెంలో కోర్ కమిటీ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని ఉగ్గినిపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల కోర్ కమిటీ, గ్రామ బూత్ కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, గొంతుని శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, కాయల మురళి, నైనంసెట్టి రమణరావు, కలగ సోమేశ్వరరావు, బుదిరెడ్డి చిన్న, పావడ కామరాజు, కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని గవరపాలెం గ్రామంలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు బుధవారం మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన కర్రి నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పైల ప్రసాద్ రావు మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి, రాష్ట్రాన్ని జగన్ కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమకు జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల నాయకులు కార్యకర్తలు అండగా నిలబడి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెక్క అప్పలనాయుడు, కర్రి స్వామి నాయుడు, డెక్క రమణ, పైల ఎరుకు నాయుడు, లెక్కల లక్ష్మీ నాయుడు పాల్గొన్నారు.



పైలా సమక్షంలో టిడిపి చేరిన వైసిపి శ్రేణులు

వ్యవసాయ మోటార్లకు

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మాడుగుల నియోజకవర్గంలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగింపును రైతులు ఎక్కడికక్కడ అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ సందిట్లో సడిమియాలాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగింపును ప్రారంభించిందని చెప్పారు. దీనిని రైతులు అడ్డుకోకపోతే తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. వ్యవసాయ పంపు సెట్లుకు ఉచితం విద్యుత్ అందిస్తామని చెబుతూనే రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మీటర్లు బిగింపుతో పాటు బిల్లుల చెల్లింపును మొదటిసారిగా రైతులే భరించాలని, ఆ తర్వాత వ్యవసాయ విద్యుత్ బిల్లుల మొత్తాన్ని నగదు బదిలీ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని చెబుతున్నారని తెలిపారు. ఎపిలో ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి స్మార్ట్ మీటర్లను పెట్టే కార్యక్రమం చేయడం దారుణమన్నారు. ఉచిత విద్యుత్ అంటూనే రైతుల పీకపై కత్తి పెడుతుందని తెలిపారు.

టెన్త్ ఇంగ్లీష్ పరీక్షకు 99 శాతం మంది హాజరు



పరీక్షా కేంద్రంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి

పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు సుమారు 99 శాతం మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె పలు కేంద్రాలను సందర్శించారు. రెగ్యులర్ విద్యార్థులు 21,229 మందికి 21,123 మంది హాజరుకాగా 106 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ప్రైవేట్ విద్యార్థులు 220 మందికి 92 మంది హాజరుకాగా, 137 మంది గైర్హాజరు అయినట్లు వెల్లడించారు. మొత్తంగా 21,458 మందికి గాను 21,215 మంది హాజరయ్యారు.

పోలీసు బందోబస్తును పర్యవేక్షించిన ఎఎస్‌పి

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును బుధవారం అదనపు ఎస్పీ విజయభాస్కర్ పర్యవేక్షించారు. తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

సేంద్రియ వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరుతూ బుధవారం శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి, ఏఎంఏఎల్ కళాశాల అగ్రికల్చరల్ బీఎస్సీ విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మండలంలోని కుంచంగి, వెంకుపాలెం గ్రామాల్లో నిర్వహించారు. గుంటూరు ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ సహకారంతో ఐసిఆర్‌పి ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం చేయు పద్ధతులు తద్వారా రైతు ఏ విధంగా లాభపడతాడనే విషయాల, సేంద్రియ ఎరువులు ఏ విధంగా తయారు చేసుకోవాలి, వాటికి కావలసిన ముడి సరుకులు, ఎలా పిచికారి చేయాలి అన్నది స్వయంగా చేసి చూపించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే వంగడాల గురించి తెలియజేశారు. దేశీ ఆవులు, దేశీయ కోళ్ల గురించి నక్షత్ర వనాలు నాటితే ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు కృష్ణవేణి, హేమలత, రేవతి, లక్ష్మీ మోహిని, శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి సంస్థ తరఫున కోన అప్పారావు, వి చక్రవర్తి, జయలక్ష్మి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న శారదావేలీ సమితి సభ్యులు, విద్యార్థులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వెంకటేశ్వరస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక

మండలంలోని చూచుకొండ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి భక్తులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సుందరపు విజయ్ కుమార్ స్వామిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, కాళ్ల చంద్రమోహన్, మాజీ సర్పంచ్ పెంటకోట నర్సింగరావు, బి కిరణ్, కాండ్రేగుల లక్ష్మణరావు, పెంటకోట రామకోటేశ్వరరావు, ఆడారి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భరత్ కుమార్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కశింకోట

వైసిపి అనకాపల్లి నియోజకవర్గం అభ్యర్థి మలసాల భరత్ కుమార్ బుధవారం తమ సొంత గ్రామం ఏఎస్ పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ పాల్గొన్నారు. ఉగ్గినపాలెం గ్రామంలో ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్యనాయుడు ప్రచారం చేశారు. కశింకోట పూసర్ల వీధిలో భరత్ కుమార్ సతీమణి మలసాల నివేదిత గడపగడపకు వెళ్లి తన భర్తను ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో ఆర్ఈసిఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నడిపల్లి సన్యాసినాయుడు, పీటర్ వైజమెన్, కలగా శివానంద్, నర్సింగబిల్లి లో సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, కొత్తపల్లిలో సర్పంచ్ కరణం శ్యామ్ సన్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న భరత్‌కుమార్ సతీమణి నివేదిత



శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరం గ్రామ శివారు గొన్నవానిపాలెం గ్రామంలో బుధవారం శ్రీకాకుళం కింజరపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థుల గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్‌కుమార్, శశికళ, పూజిత శ్రావణి, పల్లవి, నికిత, షారోన్, తేజస్విని, ప్రత్యూష గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సుగర్ ఫ్యాక్టరీ ప్రతినిధులు

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలం కేంద్రం బుచ్చయ్యపేటలో ఆదివారం చెరకు తోటకు అంటుకున్న మంటలను అర్పుతుండగా, ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోయి మృతి చెందిన సుంకర పోతురాజు కుటుంబానికి గోవాడ చక్కర ఫ్యాక్టరీ రైతు సంక్షేమ నిధి నుండి మంజూరు చేసిన రూ.5వేలు నగదును బుధవారం సుగర్ ఫ్యాక్టరీ సిడివో రామం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు రైతు సంక్షేమ నిధి నుండి నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌మెన్లు హరిహరరావు, వేపాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఎఆర్ఎస్‌లో సిద్ధంగా ఉన్న చెరుకు విత్తనం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతులకు కావలసిన చెరకు విత్తనం అందుబాటులో ఉన్నట్లు శాస్త్రవేత్త పీవీ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009ఏ 107 (వశిష్ట) నాలుగు టన్నులు, 2009ఏ 252 (నవీన్) ఐదు టన్నులు అందుబాటులో ఉందన్నారు. దీంతో పాటు విడుదలకు సిద్ధంగా ఉన్న 2010ఏ 229 ఏడు టన్నులు అందుబాటులో ఉందని చెప్పారు. టన్ను చెరకు రూ.2,800, అందుబాటులో ఉన్న చెరుకు టన్ను రూ.3000 ఉందన్నారు. ఆసక్తి గల రైతులు 9704074492 నెంబర్ను సంప్రదించాలన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని అమీన్ సాహెబ్ పేట చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి వైద్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, విశాఖ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 150 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ఏజీఎం నరసింహారాజు, ధనుంజయ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొణతాల ఎన్నికల ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఏకాదశి సందర్భంగా నూకాంబిక అమ్మవారిని సందర్శించుకున్నారు. 81వ వార్డు కార్పొరేటర్ కొణతాల భాస్కరరావు, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆయనను మర్యాదపూర్వక కలిసి స్వాగతం పలికారు. జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో కొణతాల మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన వెంటనే కొత్త అమావాస్య ఉత్సవాలను తెలంగాణలో బతుకమ్మ పండుగ నిర్వహిస్తున్నట్లే రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం న్యూ కాలనీలోని వైశ్య సామాజిక వర్గానికి చెందిన టిడిపి నాయకులు సూరే సతీష్ నివాసానికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కడిమిశెట్టి రాంజీ, వెంకట మహాలక్ష్మి దంపతులను కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్, మూడు పార్టీల నాయకులు డాక్టర్ నారాయణరావు, మల్ల సురేంద్ర, బి జోగి నాయుడు, శ్రీరామదాసు గోవింద, తాడి రామకృష్ణ, దూలం గోపి, మళ్ల శ్రీను, కొణతాల అప్పలరాజు, వినకోట బుచ్చిరాజు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

ఆత్మీయ సమావేశం

కశింకోట : మండలంలో తాళ్ళపాలెంలో టీడీపీ - జనసేన- బీజేపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పరిపాలన రావాలంటే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ, పరమేశ్వరరావు, కాయల మురళి, పొన్నగంటి అప్పారావు, ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్

బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వరస్వామి 151వ వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధర్మకర్త దొండా కన్నబాబు మంగళవారం రాత్రి అంకురార్పణ, ధ్వజారోహణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనవాయితీ ప్రకారం స్వామివారికి దొంగ పెళ్లి నిర్వహించారు. పుట్టమన్ను తవ్వి ప్రమిదలలో వేసి వివిధ రకాల పంటల విత్తనాలు జల్లారు. ఉత్సవాల ముగింపు నాటికి ఏ విత్తనాలు మొలకెత్తుతాయో ఆ రకం పంటలనే ఈప్రాంత రైతులు సాగు చేస్తారు. ఇది ఇక్కడి భక్తుల నమ్మకం. బుధవారం ఏకాదశి కావడంతో తెల్లవారుజాము నుండే స్వామి దర్శనానికి భక్తులు బారులుతీరారు. దూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లన్నీ కిక్కిరిసాయి. గోవింద నామాల స్మరణతో గిరిజాంబగిరి మారుమ్రోగింది. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం,త్రాగునీరు అందించారు.



వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

డిప్యూటీ సిఎం బూడిని ఓడించాలి


ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఓడించడానికి జనసేన కార్యకర్తలు కృషి చేయాలని మాడుగుల నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. దేవరాపల్లి మండలం, కాశీపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావును జనసేన నాయకులు పరిచయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను సమన్వయం చేస్తూ ప్రచారంలో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే టిడిపి నాయకులు పివిజి కుమార్, గవిరెడ్డి రామానాయుడులను కలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, నాయకులు గోరుపోటి రామ్మూర్తి నాయుడు, కొమర హేమంత్, వీరునాయుడు, ఇంటి సురేష్, ముర్రు పవన్ కుమార్, వేచలపు త్రినాథ్, వేచలపు చంద్రరావు, పరవాడ దేముడుబాబు, దుక్క ఈశ్వరరావు పాల్గొన్నారు.

రూ.18 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధి 84వ వార్డులో రూ.18 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆ వార్డు టిడిపి ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు తెలిపారు. వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం రింగ్ రోడ్డు శ్రీసాయి సమావేశ మందిరంలో నీలబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య కార్పొరేటర్గా ఎన్నికై మూడు సంవత్సరాలు కావస్తుందని, ఈ కాలంలో 18 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. అధికారం లేకపోయినప్పటికీ అధికారులు సహాయ సహకారాలతో నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సిరసపల్లి సన్యాసిరావు, సాలాపు మోహన్, కసిరెడ్డి సత్యనారాయణ, బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్మోహన్రావు కొట్ని రాంబాబు, తల్లూరి లక్ష్మి ప్రసాద్, కొట్ని రామకృష్ణ కొణతాల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధర్మశ్రీ సమక్షంలో వైసిపిలో చేరిన దృశ్యం

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- చోడవరం

బుచ్చయ్యపేట, రావికమతం మండలాల పరిధిలోని పోలేపల్లి, గుడ్డిప గ్రామాలకు చెందిన టిడిపి, జనసేన నుండి 20 కుటుంబాల వారు బుధవారం చోడవరం వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసిపిలో చేశారు. ఈ సందర్భంగా గళ్ళ లీలాప్రసాద్, సోములు సంజీవ్, పెద్దాడ కల్యాణం, అధికార రాజు, విస్సారపు అర్జున, కే సత్యారావు, ఉప్పులూరు రాము, సోలాపు విస్సన్నరాజు, సీతా పోతురాజు, కంచిపాటి నాయుడు, పెద్దాడ రాజు నాయుడు, ఉప్పులూరు హరిబాబు, పెద్దాడ దేవుళ్ళు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కాపు సామాజిక తరగతి పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. చోడవరం నియోజకవర్గంలో సుమారు లక్ష 15 వేల మంది కాపు ఓటర్లు ఉండగా వేరే తరగతుల వారికి టిడిపి టికెట్లు కేటాయించడం సరికాదన్నారు. దీంతో విరక్తి చెందిన తాము వైసీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని, తన ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న సత్యవతి, భరత్

ప్రజాశక్తి- కశింకోట : కసింకోట మండలం బయ్యవరం గ్రామంలో శ్రీకనకమహాలక్ష్మి ఆలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు, వైసిపి అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరతకుమార్ బుధవారం వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి అమ్మవారి ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొల్లివిల్లి జయ, ఎంపీటీసీ నాగ సత్యనారాయణ, నాయకులు నానాజీ, బాబురావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



గర్భిణులకు శీమంతాలు చేస్తున్న దృశ్యం

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - కశింకోట : కసింకోట మండలం తీడ గ్రామంలో అంగన్వాడి కేంద్రం వద్ద పోషణ పక్వాడ్ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సెక్టర్ సూపర్వైజర్ సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆహార అలవాట్లు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం గర్భిణీలకు శీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.విజయ, డి విజయ, పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో అనాథలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-యలమంచిలిరూరల్ : మండలంలో కొక్కిరపల్లి వద్ద వున్న ప్రేమసమాజంలో అనాథ పిల్లలు, వృద్ధులకు యలమంచిలి మండలం సోమలింగపాలెం సచివాలయ వీఆర్వో సుబ్రహ్మణ్యం రూ.20వేలు విలువచేసే దుస్తులు సమకూర్చారు. ఈ మేరకు తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రేమ సమాజంలో వీటిని అందజేశారు.



దుస్తులు అందిస్తున్న సుబ్రహ్మణ్యం

ఉపమాక జనసంద్రం



వెంకన్న సన్నిధిలో డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కళ్యాణోత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఉపమాక భక్త జనసంద్రంగా మారింది. నక్కపల్లి నుంచి ఉపమాక వచ్చే రహదారులన్నీ జనం రద్దీతో కిటకిటలాడాయి. స్వామి కల్యాణోత్సవం సందర్భంగా సుదూరు ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులు బందరు సరస్సులో పుణ్యసాన్నాలు అచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, కృష్ణ మాచార్యులు, శేషాచార్యుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు

హెటిరో డ్రగ్స్ ఉద్యోగుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. నక్కపల్లి శ్రీసత్య సాయి భజన మండలి, సిద్ధి వినాయక యూత్, సర్వేజనో సుఖినోభవంతు, మదర్ థెరీసా సేవా ఫౌండేషన్, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో వేరువేరుగా మజ్జిగ, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

హెటిరో డ్రగ్స్ కంపెనీ డైరక్టర్ మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కంబాల జోగులు, డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణ, డిఎస్‌పి జిఆర్ఆర్ మోహన్, సిఐ విజయ్ కుమార్‌లతో పాటు పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. డీఎస్పీ జి ఆర్ ఆర్ మోహన్, సిఐ విజయ్ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం



కొత్తకోట లో రోడ్డుపై పొర్లు తున్న వరద నీరు



కోటవుర్టలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో జనజీవనం స్తంభించింది. కాగా కురిసిన వర్షానికి ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం నువ్వు చేనుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు చెరువుని తలపించింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొత్తకోట: భారీ వర్షానికి రావికమతం మండలం కొత్తకోటలో రోడ్లు జలమయం అయ్యాయి. మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో అకస్మికంగా కురిసిన వర్షం తో గ్రామంలో మురుగునీటి కాలువలు పొంగి రోడ్లపై నుంచి మురుగునీరు పారింది. దీంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. స్థానిక గవ్రెడ్డి వారి రామకోవెల వద్ద రోడ్లు జలమయం కావడంతో పలు గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అనకాపల్లిడెస్క్:భారీ వర్షం కారణంగా నర్సీపట్నంలో రోడ్లన్నీ జలమయయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రోడ్లపైకి చెత్త చెదారం కొట్టుకువచ్చింది. వర్షపు నీరు రోడ్లపై నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీకన్య జంక్షన్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా మారింది.

కె.కోటపాడు : మండలంలోని బుధవారం మోస్తారంగా వర్షం కురిసింది. మార్చి నెల మొదటి నుంచి ఎండ వేడి అధికంగా ఉండటంతో ప్రజలు కొంతవరకు ఇబ్బంది పడ్డారు. అకాలంగా వర్షం పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంటలు ఎండుతున్న తరుణంలో ఈ వర్షం ఎంతగానో ఉపయోగిస్తుందని రైతులు చెప్పారు. ప్రధానంగా చెరక, సరుగుడు తోటలకు, నువ్వులు, మెట్ట ప్రాంతాల్లో సాగు చేస్తున్న పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతుల తెలుపుతున్నారు.

కశింకోట : కశింకోట మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజల ఉపసమనం పొందారు. మెట్ట ప్రాంతాల్లో ఎండుతున్న కూరగాయాలు పంటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని పలువురు రైతులు తెలిపారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చదురుమదురుగా చిరుజల్లుల కురిశాయి. చిరుజల్లుల వల్ల పంట పొలాల్లో ఉన్న మినుము, పెసర బొబ్బర తదితర పంటలు తడిచిపోయాయి. పలు గ్రామాల్లో కోత దశలో ఉన్న జనుము పంట సైతం తడిచి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి

25 నాటు తుపాకీలు స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి:చింతపల్లి, జికెవీధి, కొయ్యూరు మండలాల్లో 25 నాటు తుపాకీలు పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు చింతపల్లి అదనపు ఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో గిరిజనులు దగ్గర ఉన్న నాటు తుపాకులు తమకు అప్ప చెప్పాలని, వారిపై ఎటువంటి కేసులు ఉండవని తెలిపారు. ఎవరైనా నాటు తుపాకితో పట్టుబడితే సుమారు రూ.10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.ఇంకా ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే వెంటనే తమకు స్వాధీన పరచాలని కోరారు.

వైసిపిలో పలువురు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:నాతవరం మండలం ఎంబి.పట్నం గ్రామంలోని 50 టీడీపీకి చెందిన కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా నర్సీపట్నంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. రాబోయే రోజుల్లో 30 గ్రామాల నుంచి పార్టీలో చేరనున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో 30వేల భారీ మెజార్టీతో గెలుస్తామనే నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ విండో విధానంలో అనుమతులు

అల్లూరి జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, పిఓ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: పొలిటికల్ పార్టీల అభ్యర్థులకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తామని పాడేరు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఏ పి.ఓ వి. అభిషేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బృందాలకు ఎన్నికల పోర్టల్స్ నిర్వహణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సువిధ, సివిజిల్, ఎన్ కోర్, ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పించారు. సువిధ యాప్ నుండి దరఖాస్తులు స్వీకరించి, ఎన్ కోర్ యాప్ నుండి అనుమతులు జారీ చేస్తామన్నారు. రిటర్నింగ్ అధికారుల ఆమోదం లేకుండా ఎటుంటి అనుమతులు జారీ చేయకూడదన్నారు. సిబ్బంది అనుమతులు జారీ చేయడానికి స్వయం నిర్ణయాలు తీసుకోకూడదని చెప్పారు. అన్ని రకాల ప్రచార కార్యక్రమాలకు రాజకీయ పార్టీల నేతలు రిటర్నింగ్ అధికారుల అనుమతులు పొందాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల యాప్‌లపై అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసీలు బివిఎస్ శర్మ, పి.అంబేద్కర్, సిపిఓఎస్. ఎస్. ఆర్.కె. పట్నాయక్, పాడేరు ఎంపిడిఓ సాయి నవీన్, జి.డబ్ల్యూఎస్ జిల్లా సమన్వయకర్త సునీల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి, పిఒ



ఆలయంలో దర్శించుకుంటున్న పైలా

పథకాలపై ప్రచారం చేయాలి : పైలా

ప్రజాశక్తి-మాడుగుల:గ్యారెంటీ పథకాలను జనసైనికులు ప్రజల్లోకి తీసుకెళ్లి తన గెలుపుకు కృషి చేయాలని టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. బుధవారం మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో పైలా ప్రసాదరావును జనసేన సైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ, ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో వైసిపి దౌర్జన్య పాలన నచ్చక ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మండలాల వారీగా చాలా మంది చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గవ్రెడ్డి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శిలు దాసరి అచ్యుతరావు పాల్గొన్నారు.

ఎం.కోడూరులోని లక్ష్మీనరసింహస్వామిని పైలా ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జి గొల్లవిల్లి శ్రీరామమూర్తి, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మింది వరాహమూర్తి, అప్పాన భాస్కరావు ఉన్నారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-చీడికాడ:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలు 100 రోజులు విధిగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కే.సరోజిని కోరారు. మండలంలోని జి కొత్తపల్లి గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఆవాలగడ్డ సమీపంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో కూలీలందరూ కూడా పని దినాలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.



పట్టుబడిన నగదు

రూ.2 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద రూ.2 లక్షల నగదును సీజ్ చేసినట్లు సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం రాత్రి తుని నుండి విశాఖ వెళుతున్న కారును తనిఖీ చేయగా రూ.2 లక్షల నగదు ఉండడంతో నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేని కారణంగా సీజ్ చేసామన్నారు. ఈ నగదును మహారాష్ట్రకు చెందిన రితేష్ సీతారాంజి పార్వర్కర్, శక్తి సింగ్ మహేంద్ర సింగ్ కారులో తీసుకు వెళ్తుండగా, వారి వద్ద నుండి నగదు తీసుకొని సీజ్ చేసామని సిఐ వెల్లడించారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ

పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -అనంతగిరి: 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ కు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఇతరులను లోనికి అనుమతించ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రం సిఫ్‌పి ప్రసాద్. డిఓ స్వరూపరాణి, ఎంఈఓ బాలాజీ పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు:- సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ విస్తతంగా తనిఖీలు చేపట్టారు. ఏఓబి సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో మద్యం, డబ్బు, అక్రమ కార్యక్రమాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేకంగా చెక్ గెట్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జోలాపుట్టు జడ్పీ హైస్కూల్, బోయ్స్ వన్, గర్ల్ వన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు.



మాట్లాడుతున్న అప్పలనాయుడు

అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల: అటవీ రేంజ్ అధికారిగా ఆర్.అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా రణస్థలం గ్రామం నుండి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. అటవీ సంపద తరలిపోకుండా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు, ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహణ కోసం బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు.అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మే నెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ జాతర మహోత్సవా లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వర్తక వాణిజ్య ఉద్యోగ, కార్మిక, వ్యాపార వర్గాల వారు అన్ని విధాలుగా సహకారం అందించాలని ఆలయ కమిటీ చైర్పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కోరారు . ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్తంగా కలిసి నిర్వహించాలని సూచించారు.

ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొట్టగుల్లి రామారావు, ప్రధాన కార్యదర్సులుగా ప్రసాద్ రావు నాయుడు, శ్రీను, వెంకటరమణలను నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కార్యవర్గ సభ్యులుగా మరికొందరినీ నియమించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కే సింహాచలం నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులతో కుదేలు

▶▶ డయాలసిస్‌కు వేలాది రూపాయల ఖర్చు, ఆర్థికంగా సతమతం
▶▶ పలువురు గిరిజనులు మృత్యువాత
▶▶ మరో ఉద్దానంలా పాత, కొత్త ధర్మవరం గ్రామాలు

ప్రజాశక్తి -కొత్తకోట:

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పాత, కొత్త ధర్మవరం గిరిజన గ్రామాల్లో పలువురు కిడ్నీ వ్యాధులతో భాధ పడుతున్నారు. గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధులకు గుర్రై పలువురు మృతి చెందుతున్నారు. పలువురు గిరిజనులు ఒళ్ళు, కాళ్ళు పొంగడంతో పాటు రక్తహీనత లోపం వంటి వ్యాధులు ప్రబలి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.

ఐదేళ్ల కిందట తాజాగా ఏర్పడిన ఈ పంచాయతీలో కొత్త ధర్మవరం, పాత ధర్మవరం గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలలో సుమారు 600 జనాభా ఉంది.పాత ధర్మవరం గ్రామంలో గిరిజన కుటుంబాలు నివసిస్తూ ఉండగా కొత్త ధర్మవరంలో గిరిజన కుటుంబాలతో పాటు బిసి కుటుంబాలు నివసిస్తున్నారు. రెండు గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం రక్షిత పథకం నిర్మాణం చేపట్టారు. అదే తాగు నీరు రెండు గ్రామాల ప్రజలు వినియోగించుకుంటున్నారు. అలాగే పాత ధర్మవరం గ్రామానికి సమీపంలో తాగునీటి బోర్ ఉంది. గతంలో ఈ బోరు నుంచి తాగునీరు సేకరణ ఉండేది. ప్రస్తుతం అది వాడిక లేదు.

ఇటీవల పాతధర్మవరం గ్రామానికి చెందిన గత్తెము కొండమ్మ (60) మృతి చెందింది. ఆమె గత కొన్నాళ్ళుగా కిడ్నీ వ్యాదితో భాధ పడింది. అలాగే గ్రామంలో ప్రస్తుతం లగుడు భీమన్న (56) ఈ వ్యాధితో గత ఏడాదిగా భాధ పడుతున్నాడు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వారానికి ఒక సారి డయాలసిస్ చికిత్స చేయించు కుంటున్నాడు. గతంలో డయాలసిస్ చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్లేందుకు వ్యాధి గ్రస్తునికి అంబులెన్సు సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఆ సదుపాయాలు లేక ప్రతి వారం ఆసుపత్రికి డయాలసిస్ పొందేందుకు రూ



ధర్మవరం గ్రామం

వెయ్యి రూపాయల ఖర్చులు అవుతున్నాయని, అవి లేని రోజు వైద్య సేవలు పొందలేక పోతున్నామని బాధితుడు భీమన్న వాపోయాడు. గ్రామంలో పాము చిన పెంటయ్య, (60), కుమ్మరి అచ్చిబాబు (64) గత రెండేళ్ళ గా కిడ్నీ వ్యాధి లకు గుర్రై మంచాన పడ్డారు.

కొత్త ధర్మవరంకు చెందిన పల్లా మోదునాయుడుకు గత ఆరు నెలల కిందట ఈ వ్యాధి సోకింది. అంతే కాకుండా 40 ఏళ్ళ గత్తెము చిలుకమ్మ (రేషన్ షాప్ డీలర్)గత అరేళ్ల గా ఈ వ్యాధి కి గుర్రై ఇబ్బంది పడుతోంది. ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయినా ఆమె ఆరోగ్యం కుదుట పడలేదు. గతంలో గత్తెము చిన నూకరాజు, చీమల వీరేషమ్మ ఈ వ్యాధి తో మృతి చెందారు.ఈ వ్యాధులకు బయ పడిన కొంత మంది యువత ఊరు వదిలి మరో చోటుకు తరలి పోతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేక పోవడం పై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి

ఎందుకు ఇలా వ్యాధులు సోకుతున్నాయి అన్నది అర్థం కావడం లేదు. గత కొన్నాళ్ళు గా ప్రతి ఇంటికి ఒకరు కిడ్నీ సమస్యతో భాధ పడుతున్నారు. గతంలో చాలా మంది మృత్యు వాత పడ్డారు. తాగునీరు పరీక్షలు కూడా జరిగాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి. లేదంటే గ్రామంలో నివాసం ఉండడానికి ప్రజలు భయపడు తున్నారు.



గత్తెము రాజ్యలక్ష్మి
సర్పంచ్..ధర్మ వరం గ్రామం

వైద్యానికి అధికంగా ఖర్చులు

పేదలకు కిడ్నీ సమస్య లు రావడం తో మంచానికి పరిమితం అవుతున్నారు. విశాఖ వంటి నగరాలకు వెళ్లి వైద్యం పొందాలంటే ఖర్చుతో కూడిన పని. కొందరు ఖర్చులకు లేక వైద్యం సేవలకు దూరం అవుతున్నారు... వైద్య ఆరోగ్య శాఖ చొరవ తీసుకోని గ్రామంలో ఈ వ్యాధులు ఎందుకు సోకుతున్నాయో సమగ్రంగా సర్వే చేయాలి... డయాలసిస్‌కు వెళ్లే భాదితులకు అంబులెన్సు సదుపాయం కల్పించాలి...



పల్లా సింహాద్రి,
ఉప సర్పంచ్.. ధర్మ వరం



భీమన్న



అచ్చియ్య



చిలుకమ్మ

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర



మాట్లాడతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అరకు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. బుదవారం అరకువేలి మండల సిపిఎం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాల రక్షణకై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పోడు పట్టాల సాధనకు, మంచినీరు, రోడ్డు, గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలకు సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. జివో 3కి చట్టబద్ధత, 100శాతం ఉద్యోగ అవకాశాలు, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని దశలవారీగా అనేక పోరాటాలు చేస్తుందని తెలిపారు.గిరిజన ప్రాంతంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపితో భవిష్యత్తులో ముప్పు ఉందన్నారు. వైసిపి, జనసేన, టిడిపి పార్టీలు బిజెపికే మద్దతు పలుకుతూ గిరిజనులకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని పిలుపునిచ్చారు. ప్రచారం చేసి ఆదివాసి గిరిజనుల్లో చైతన్యం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, వివి జయ, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, పద్మాపురం ఉపసర్పంచ్ జన్ని బాగత్ రామ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు గత్తుం బుజ్జిబాబు, పి.బాలదేవ్, పాంగి రామన్న, కె.మొద్దు, టి.జోషి, అప్పన్న, కొగేష్, అప్పలస్వామి, సిహెచ్ గురుమూర్తి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల పక్షాన పోరాం
జడ్పిటిసి గంగరాజు

అనంతగిరి: నిరంతరం ప్రజా పక్షాన నిలబడి పోరాటం చేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అనంతగిరి జడ్పిటిసి గంగరాజు కోరారు. మండలంలో రాజుపాక గ్రామంలో ఆయన మాట్లాడుతూ,లక్ష్మీపురం జంక్షన్ మంచి రాజుపాక వరకు బీటి రోడ్డు, రాజుపాక నుండి డేకాపురం, హుకుంపేట మండలం పటకదవడ వరకు కలెక్టివిటీ పాడేరు ప్రాజెక్టు కింద రూ రెండు కోట్ల నలభై లక్షలతో రోడ్లు పూర్తయ్యాయని, మెటల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తనను ప్రజలు గుర్తించి జెడ్పిటిసిగా గెలిపించడంతో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేశానని ఆయన స్పష్టం చేశారు. మరికొన్ని గ్రామ సమస్యలను గుర్తించి నిధులకు ప్రతిపాదనలు చేసి అధికారులకు పంపించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత జె.రామన్న, మహిళా సంఘం నాయకురాలు దేముడమ్మ, డి.శ్రావణి, జె దేవి, గ్రామస్తులు డీ.లచ్చు, బీమ్మన, రాజు, లక్ష్మణ్, సింహాద్రి పాల్గొన్నారు.